# కుంటెద్దు

చే తిలో చెర్నాకోలతో తొట్టిలో కూర్చొని ఎడ్లనదల్చుతున్న అర్నాద్‌ని సినిమా హీరో ఆవహించాడు. బండి అప్పటికే ఊళ్ళో కొచ్చేసింది గాని పొలాల్లో అయితే 'చెంగు చెంగున గంతులు వేయండి' అని తనకొచ్చిన పాట నందుకొనేవాడే!

పైడిపాల

అర్నాద్ సినిమా హీరోలా గ్లాస్కో పంచె, జుబ్బా వేసుకోలేదు. తనకలవాటయిన నిక్కరు, చొక్కా వేసుకున్నాడు. కాకపోతే భార్యతో కలిసి సినిమా కెళ్ళబోతున్నాడు కనుక కాస్త ఖరీదయినవి వేసుకున్నాడు. అతని కళ్ళ ముందు సినిమా కోసం ముస్తాబయి ఎదురు చూస్తున్న పార్వతీ, పిల్లలూ....

పల్లెలో పుట్టి పెరిగిన పార్వతికి సినిమాలంటే వల్లమాలినమోజు. ఆ బలహీనతను తన అవసరానికి ఉపయోగించుకుంటున్నాడు. మామూలుగా అయితే రెండు మైళ్ళ దూరంలో ఉన్న పట్నంలోని సినిమాలకు పార్వతి ఇరుగు పొరుగు వాళ్ళతో కలిసి నడిచే వెళ్తుంది. కాని రెండు రోజులుగా ధుమ ధుమలాడ్తున్న పార్వతిని ప్రసన్నురాల్ని చేసుకోవడానికి ఈ రోజు "మొగుడు-పెళ్ళాలు" సినిమాకు మొదటి ఆటకు తీసుకెళ్తాననీ, రెడీగా ఉండమనీ చెప్పాడు. పిచ్చి పార్వతి-కోపమంతా మర్చిపోయి "ఎంత మంచి వాడవురా...." అన్న ధోరణిలో సంబరపడిపోయింది. రిక్షా మీద వెళ్దామని సరదాపడింది. రి క్షాలో యిరికి వెళ్ళడం కంటె హాయిగా బండి మీద వెళ్దామనీ-కావాలంటే ఆమెస్నేహితురాళ్ళను కూడా తీసుకెళ్దామనీ చెప్పాడు. పార్వతి ఆనందంతో యింటింటికీ బొట్టుపెట్టి మరీ చెప్పొచ్చింది... అందుకే పెందరాళేబండికి గూడు కట్టి యింటికి ప్రయాణమయ్యాడు.

"హోయ్..ఓహోహో " బండి వీధిలోకి రాగానే పగ్గాలు లాగి పెట్టి ఎడ్లను అదుపు చేశాడు. తొట్టి మీదుగా ముందు కురికి కాడిపట్టుకొని నిల్చుని యింటికేసి చూశాడు. సాధారణంగా బండి సవ్వడి వినబడగానే కొడుకు, కూతురూ పరిగెత్తుకొని వస్తారు. అలాంటిది, ఎవ్వరూ రాకపోవడంతో ఆశ్చర్యపడుతూ ఎడ్లను విప్పి, లోపల కెళ్ళాడు. అరుగు మీద బిక్క మొహాల్తో కూర్చున్న పిల్లలిద్దర్నీ చూసి-ఏదో జరిగి ఉంటుందని అనుమానిస్తూనే వాకిట్లో అడుగు పెట్టాడు.

నులక మంచం మీద ముసుగు పెట్టి పడుకున్న తండ్రి మూలుగులు వినిపిస్తున్నాయి. పక్కనే ముక్కాలి పీట మీద పెట్టి ఉంచిన కంచంలో నీరు కారి పోతున్న అన్నం, కూర.. మంచినీళ్ళ చెంబు -పరిస్థితి అర్థమయింది. పార్వతి మళ్ళీ మాట తూలితే అలిగుంటాడు ముసలాయన. దగ్గరగా వెళ్ళి తండ్రి వంటి మీద చెయ్యి వేసి చూసాడు అర్నాద్. పెరుమాళ్ళు వళ్ళు కుంపటిలా నిప్పులు చెరుగుతోంది.

"నాన్నా...నాన్నా.. " ఆందోళనగా తట్టి లేపాడు అర్నాద్.

అతి ప్రయత్నం మీద కళ్ళు విప్పాడు పెరుమాళ్ళు. కొడుకును చూడగానే అతడికళ్ళు ఆషాడ మేఘాలయ్యాయి.

"ఏం నాన్నా, ఏం జరిగింది? అన్నం మానే శావే?"

"ఏం చెప్పమంటావురా అంతా నా ఖర్మ. నేనీ ఇంటికి బరువైపోయాను. నాకింక బతకాలని లేదు. నాకు కాస్త విషం ఇచ్చి పుణ్యం కట్టు కోరా..."

"అవేం మాటలు నాన్నా.. అదేమైనా అంటే చెప్పు అడుగుతాను.."

"ఆ అడుగుతారు .. అడగరూ మరి? తేరగా దొరికింది పెళ్ళామే కదా-? కొడుకు రాగానే నా మీద పితూరీలు చెప్పడం అయిపోయిందన్నమాట. అయినా నేనే మన్నానని? ఈ చండాలం చాకిరీ నే చెయ్యలేనన్నాను. అది కూడా తప్పేనా?" ఇల్లు తుడుస్తున్న పార్వతి చీపురు కట్టతో బయటకు వచ్చింది.


"పార్వతీ, నువ్వు నోర్మూయ్.. అసలు విషయం తెలుసుకుంటుంటే ఎందుకలా విరుచుకు పడతావ్? ఆయన నిన్నేం అన్లేదు. అయినా నువ్వు తయారవకుండా ఇలా ఉన్నావే?" సాధ్యమైనంత మెత్తగా మందలించాడు.

"ఆ చాల్లెండి. సినిమా ఒక్కటే తక్కువ నా మొహానికి. ఈ బురద గుంటలో పడిన నాబతుక్కి సరదా కూడాను. పొద్దుటి నించీ ఆయన పెట్టిన గొడవ అంతా యింతా కాదు. ఇలాంటి బాధ పగవాళ్ళకి కూడా వద్దు." పైట అడ్డెట్టుకుని పెల్లుబుకుతున్న దు:ఖాన్ని అదుపు చేసుకొంటోంది.

"బాధ పడుతోంది మీరి ద్దరూ కాదు. మధ్య నేను." అంటూ వారుణాస్త్రాన్ని ప్రయోగించిన పార్వతికి లోబడి ఆమె వెంటలోపలి కెళ్ళాడు అర్నాద్. తలుపులు చేరేసిమంచం మీద కూలబడిన ఆమె పక్కనే కూర్చొన్నాడు. ఆమె కన్నీళ్ళతో దిండు తడిసి ముద్దవుతోంది.

"పారూ... ఏయ్ నిన్నే" బుజం మీద చెయ్యేసి బలవంతంగా తనవేపు తిప్పుకున్నాడు.

బహుమతి పొందిన కార్టూన్ స్ట్రిప్



“నువ్వు అవస్థపడుతున్న మాట నిజమే–కాదనను. కాని ఏం చేస్తాం మరి? రోగిష్టి మనిషిని వదిలేశారని న ఋగురూ నానా మాటలూ అంటారు. అందుకని ఒర్చుకోక తప్పదు...” ఆమె కన్నీటి చారికల్ని వ్రేళ్ళతో తుడుస్తున్నాడు.

“మీరెన్ని చెప్పండి–ఈ గొడ్డు చాకిరీ ఇక నావల్ల కాదు. ఎంత సేవ చేసినా ఆయనకు మంచి దాన్ని కాలేకపోతున్నా!”

“అసలేం జరిగింది?”

“మీరలా పొలం వెళ్లిం తర్వాత అన్నం వేడిగా ఉంది తినమంటే వద్దన్నారు. నోరు బాగో లేదు–ఏదైనా చేసిపెట్టమంటే–రెండు చల్లట్లు చేసిపెట్టాను. అవి తినీ తినగానే మంచం దగ్గర వాంతి చేసుకున్నారు. అదంతా శుభ్రం చేసేసరికి తలప్రాణం తోక్కొచ్చింది. ఇంతలో పోస్టులోమీ సావిత్రి రాసిన ఉత్తరం వచ్చింది. వాళ్ళాయన ఆఫీసు సొమ్ము వాడేసేడట,నెలాఖరులోగా అయిదు వేలు ఆఫీసులో కట్టక పోతే ఉద్యోగం ఊడి పోతుందట. అంచేత కట్నం బాపతు పెట్టి బళ్ళ కింద ఇస్తానన్న అయిదు వేలూ ఇప్పుడు పంపించమనీ. లేకపోతే ఆయనగారు పుట్టింటికి పంపించేస్తానని బెదిరిస్తున్నారనీ – ఎలాగైనా డబ్బు సర్దుబాటు చేసికాపరం నిలబెట్టమనీ ఆవిడ ఉత్తరం రాసింది.మీ నాన్న నాకే దేదో సొది చెపితే – ఇక్కడు డబ్బు చెట్లేవీ లేవన్నాను – అంతే. ఇక పరామర్శ కొచ్చిన పురుషోత్తంగారి దగ్గర నేను ఆయన్నేదో రాచి రంపాన పెడుతున్నట్లు మాట్లాడేరు. పురుషోత్తంగారు వెళ్లాక. నాకూ ఒళ్ళు మండి చెడి. మడా. అనేశాను. దాంతో ఈ నిరాహారదీక్ష ..నేను చేసిన నేరమేమిలో మీరే చెప్పండి – ఆడబడుచుకి జీవితం పొడుగునా దోచి పెటాలంటే మనది మాత్రం ఎంత సంసారం చెప్పండి?”

“నువ్వన్న దానిలో తప్పులేదు. కానీ నువ్వు మాట్లాడ క ఊరుకుంటే నేను నచ్చ చెప్పే వాణ్ణి. అయినా మన దగ్గర మాత్రం డబ్బేది? తనకి వైద్యం చేయించడానికే దిక్కులు చూస్తున్నానని తెలిసి కూడా...”



“కూతురంటే అంత తీపి మరి. నేను మాట్లాడక ఊరుకున్నా. అదే పనిగా నమిలేస్తుంటే – ఉడుకు మోత్తనం పట్టలేక అనేశాను. జరిగిందేదో జరిగి పోయింది. నా మాట విని వెంటనే బయల్దేరి రమ్మని బావగారికి ఉత్తరం రాయండి. ముసలాయన వైద్యం గురించి. సావిత్రి కాపరం గురించి. ఆయనే మంటారో చూద్దాం. ఇల్లు పంచుకో కుండా దూరంగా ఉన్నారన్న మాటే గాని. వాళ్ళ కున్న

సుఖం మనకెక్కడుంది?"

"కాని అన్నయ్య రావడానికి నాన్న ఒప్పుకోవద్దూ?"

"ఆయనకేం! కష్టపడుతున్నది మనం. రక్త సంబంధం ఉన్న తర్వాత తప్పుతుందా? రేపే ఉత్తరం రాయండి."

"అలాగే..నువ్వు లేచి వంట చేస్తే నాన్నకు నేను నచ్చ చెప్పి అన్నం తినమంటాను.. నా బంగారు కొండవు కదూ. ఎలాగో సర్దుకోమరి.." ఆమె ఫాల భాగం మీద ముద్దు పెట్టి బుజ్జగించాడు.

"అన్నట్టు... మొదటి ఆట ఎలాగూ అందదు. [illegible]కో ఆటకి వెళ్దాం...ఎలాగూ బండి సిద్ధం చేసాను [illegible]?"

పార్వతి కళ్ళు అంగీకార సూచకంగా మెరిసాయి. పెద్ద బరువు దింపుకున్నట్టు గుండెల నిండా గాలి పీల్చుకొని ఆమె వంటింటి వైపు, అర్నాద్ తండ్రి మంచంవైపూ దారి తీసారు.

***

నాలుగు రోజుల తర్వాత పొలం నుంచి పాల కావిడి బుజాన వేసుకొని వస్తున్న అర్నాద్‌ను పురుషోత్తం ఆపుచేసాడు. పురుషోత్తం అరుగు మీద కూర్చుని చుట్టలు చుట్టు కుంటున్నాడు. అరుగు దగ్గరగా కావడి కర్ర ఊతేసుకుని అర్నాద్ [illegible]బడ్డాడు

## పిచ్చివాడి ప్రేమ

చల్లనిగాలి
వెన్నెట్లో హాయిగా వాడు
బోర్లా పడుకుని
గట్టిగా వాటేసుకున్నప్పుడు
వాడికి
మట్టి కౌగిలి
మట్టే వాడి ముద్దు
మట్టే వాడి భార్య
మట్టే వాడి స్వర్గం
మట్టే వాడి సర్వస్వం
భూమ్మీద వాడో గజ ఈతగాడు

—కె. శేషుకుమార్

"మరేం లేదు అల్లుడూ. మొన్నొచ్చినప్పుడు మీ నాన్న కళ్ల నీళ్లెకున్నాడు. ఇప్పుడొంట్లో ఎలా ఉందో తెలుసు కుందామని ఆపుజేసాను."

"ఈ రెండు రోజుల్నించి కొంచెం నయమే. ఎన్ని మందులు వాడినా కాలివుండు మాత్రం మానడం లేదు."


"అది ఈ గచ్చాకుకీ, పుచ్చాకుకీ తగ్గదయ్యా పెద్ద డాక్టరెవరికైనా చూపించాలి. ఈ మాటంటే మీ నాన్న ఒప్పుకోడు. అతని కెప్పుడూ డబ్బుకీ ప్రాణానికీ లంకె. చెయ్యి కలిసి రాక కానీ అతను పడ్డ కష్టానికి పదెకరాల కొండ్ర యెన కెయ్యాల్సిందే. మా చెడ్డ కష్ట జీవి. ఎప్పుడూ ఓ నాడెమైన గుడ్డ కట్టగా చూడ లేదు నేను. మీ మురళీని కాలేజీలో చదివించడానిక్కూడా ఎన్ని లెక్క లేసాడనీ? ఆ ఖరికి 'పెద్ద కట్నం తీసుకొచ్చాక డబ్బొస్తుందని మేమంతా నచ్చ చెబితే, కాలేజీలో చేర్చాడు. తీరా ఉద్యోగం వచ్చాక ఆడేమో కట్నం లేని పెళ్ళి చేసుకున్నాడు. అప్పటి కింకా నీకు చిన్న తనమనుకుంటాను. మీ అన్నయ్య పెళ్ళి మాట చెప్పే సరికి పెరుమాళ్ళు బావ నిప్పుతొక్కిన కోతి అయిపోయాడనుకో.. ఇంతకీ మురళి ఇప్పుడే ఊళ్ళో ఉంటున్నాడు?"

"హైదరాబాదులో.. ఈమధ్య ప్రమోషను కూడా వచ్చిందంట"

"రాకపోకలు లేవను కుంటాను. ఉత్తరాలైనా రాస్తుంటాడా?"

"ఎప్పుడైనా..అదైనా నాన్నకు తెలియకుండా."

"పెరుమాళ్ళు బావ మా చెడ్డ పట్టుదల మనిషి. దానికి తోడు పిసినితనం...ఏం సుఖపడ్డాడు చెప్పు? ఒపికున్నన్నాళ్ళు పొలం విడిచిపెట్ట లేదు. ఈ షుగరు



జబ్బొచ్చి కురుపేసింతర్వాత కూడా కుంటుకుంటూ వెళ్లేవాడయ్యా పాపం ....ఎటొచ్చీ ఈరెండు వారాలు గానే మంచాన పడ్డాడనుకుంటాను. బాబూ అను కూడదు కాని అదీ మాయదారి జబ్బు బతికి నన్నాళ్లింకా బతకడు. అన్నయ్యకు కూడా రాసి కాసింత మంచిచోట వైజ్జిగం చేయించండి. పిత లాటకం మనిషే అనుకోండి. కనీసం పోయేముందైనా సుఖపెట్టండి బాబూ.... ”

“అదే మావయ్యా నేనూ బాధపడేది. తిరిగి నన్నాళ్లు తను సుఖపడలేదు – ఎవర్నీ సుఖపడనివ్వ లేదు. అలాగని సంపాదించిందీ లేదు. నా బాధలు నేను పడుతూ పెద్దాసుపత్రిలో చూపించాలంటే శక్తి చాలదు – అప్పో సొప్పో చేద్దామన్నా నాన్న ఒప్పు కోడు. డబ్బు ప్రాణం కంటే ఎక్కువ అంటాడు.. అన్నయ్యని రమ్మని ఉత్తరం రాసాను.. ఇవాళో రేపో..” అర్నాద్ మాటలు పూర్తికాకుండానే మువ్వల చప్పుడుతో ప్రక్కన రిక్షా ఆగింది. రిక్షాలో బ్రీఫ్ కేసుతో మురళి !

“తమ్ముడూ, బాగున్నావా ? ” రిక్షా దిగి ఆప్యా యంగా పలకరించాడు మురళి.

“అల్లుడూ, నీ గురించే అనుకుంటున్నాం. నీకు నూరేళ్ళాయుషు. ఇదే నా రాక ? పైకి రా. కాఫీ పుచ్చుకుని వెళ్దువు గాని. ” అర్నాద్ మురళితో మాట్లాడే అవకాశం ఇవ్వకుండా పురుషోత్తం తొందరపడ్డాడు.

“ఆనక వస్తాను మావయ్యా. ఇంకా మొహం కూడా కడగలే” రిక్షా యెక్కాడు మురళి.

“ అవునులే పెద్ద ఆఫీసరువి మరి–”పురుషోత్తం వేసిన నిష్ఠూరం రిక్షా మువ్వల సవ్వడిలో కలిసి పోయింది.

“వస్తాను మావయ్యా” అంటూ రిక్షా వెనకే వడి వడిగా నడుస్తున్నాడు అర్నాద్.

***

ఎండ, వాన, వెన్నెల. . . అన్నిటికీ నిలయమైన ఆకాశం ఎప్పుడెలా ఉంటుందో ఎవరు చెప్పగలరు? మనసు కూడా ఆకాశం లాంటిదే. తన ఆశల్ని అడియాసలు చేసి పైసా కట్నం ఆశించకుండా ఆదర్శ వివాహం చేసుకొన్న పెద్ద కొడుకు మురళీ మొహాన్ని ఇక జన్మలో తనకు చూపించొద్దని శాసిం చిన పెరుమాళ్లు–ఇన్నేళ్ల తర్వాత మురళి వచ్చి పలకరించగానే, గాలికి మబ్బులు మటు మాయమైన ఆకాశంలా పులకించి పోయాడు. మురళి ని ఆలింగ నం చేసుకుని ఆనంద బాష్పాలతో అభిషేకించాడు.

దయనీయమైన పరిస్థితిలో వున్న పెరుమాళ్లును చూసిన మురళి హృదయం ద్రవించింది. తండ్రి ఎంత మొండికేసినా వినకుండా పట్నంలోని సర్జనుకి తీసుకెళ్లి చూపించాడు.

డాక్టర్ని సంప్రదించి వచ్చిన మురళి చెప్పిన వార్త విని అర్నాద్ నిశ్చేష్టుడయ్యాడు.

“అవున్నా తమ్ముడూ. నువ్వు నాకు ఉత్తరం రాయడం చాలా మేలయింది. మరో వారం ఆలస్యం అయితే నాన్నని చేతులారా పోగొట్టుకొనే

# అభిరుచి అయ్యవార్లు

గ్రహగమనాల దిశలు మారిన పుకార్లు
నిర్మలాకాశంలో తోకచుక్కల షికార్లు
అరుదెంచిరి అభిరుచి అయ్యవార్లు!

భాషలో చమత్కారాల విభాష
సొంత సూత్రీకరణల తమాష
అభిరుచి పరమార్థం నిర్వికల్ప సమాధి!
సమిష్టి నష్టంలో వ్యష్టి పరాకాష్ట-

మంచి మనుషుల మంచి కోర్కెలు
మనుగడ లక్ష్యాల్ని ఉద్ధరిస్తాయట
మంచి అభిరుచుల విజయాల కోసం
మానవ శక్తుల పోరాటం లేనే లేదట!

నూతన శక్తుల ఆవిర్భావం
నూతన యుగాలకు నాంది
నూతన యుగాల విజయం
ఉన్నత సమాజాలకు ప్రస్తావన
నూతన యుగాల నాందీ ప్రస్తావన
అందరి వందర వందర అభిరుచుల్ని
మమేకం చేసే నూతన ప్రజాతంత్ర చైతన్యం-

కృష్ణపక్షం కోరే ఆత్మాశ్రయుడు
మహాప్రస్థానం మానేసిన కాందిశీకుడు
చీకటిని విద్యుల్లాసంగా ప్రేమించేవాడు
వేకువ రవ్వల జడి సవ్వడి చూడలేదు

కళేబరాల విగాద వెతల కవాతు
కావ్యగుగ్రం శరారుడు కూలిన ప్రాయిడు
కిలికించితాల భావ కవితా లాలసుడు
చవి చెరచిన కాక్టైల్ విమర్శకుడు

అభిరుచి సిలువ మోసే పరివ్రాజకుడు
కవితా విప్లవాల రసగంగాధరుడు

ప్రకాండులు తేల్చిన పండిత చర్చ
ప్రకృతి పురుషుల ఆత్మరతి

యూయం యూయం వయం వయః
గాయం గేయం అభావం స్వభావం

డీ-ఐడియలైజేషన్ సుడిగాలి
రీ-ఐడియలైజేషన్ సీమపాళి
అలయనేషన్ వలుసమరాళి
వస్తువు శిల్పంగా మారిన రాచకేళి

చూపు లేనివాడు కబోది
చూపు వద్దన్నవాడు కిలాడి

చూపు చూపిన సాహిత్య వారసత్వం
బహుజన హితాయ బహుజన సుఖాయ
స్వాంత సుఖాయ సమాజ వినాశాయ

—జ్వాలాముఖి

వాళ్లం. ఇప్పుడు కూడా డాక్టరు నా మీద మండి పడ్డాడు– ఎడ్యుకేటెడ్ అయివుండి కూడా ఎందుకు నిర్లక్ష్యం చేసారని ? మన సంబంధాల గురించి ఆయనకేం చెప్పలేక తల వంచాను. నాన్న కాలి మీద 'గాంగరిన్' వల్ల కాలంతా కుళ్లి పోయిందట. ఒకటి రెండు రోజుల్లో కాలు తీసెయ్యక పోతే మనిషి బతకడం అసాధ్యమని చెప్పారు.

“ నాన్నకీ విషయం తెలుసా ?” అర్నాద్ కళ్ళు అశ్రు సిక్తాలయ్యాయి.

“లేదు. నేను చెప్పలేదు. నాన్నకీ విషయం చెబితే కుంటివాడిగా బతకడానికి సుతరామూ అంగీక రించడు. .. ఆపైన “యాంపుటేషన్”కి అంత ఖర్చు పెట్టడానికి అసలే ఒప్పుకోడు. ఇప్పటికే తనకు వైద్యం చేయించే కంటే – ఆడబ్బు సావిత్రికి పంపిస్తే సంతోషిస్తానంటున్నాడు. దారి పొడుగునా రిక్షాలో సావిత్రి విషయమే. ఆ డబ్బు నాన్న బాకీ ఉన్నమాట నిజమేనా?”

“బాకీయా? పాడా? ఇలా బావగారు బెదిరిస్తున్నారని సావిత్రి ఉత్తరం రాయడం ఇద్దరూ కలిసి ఆడే నాటకమే – ఇక్కడేదో పాతర ఉందని వాళ్ళ భ్రమ.”

“అయినా ఆవిడకేం లోటు జరిగిందని? అక్కలాగూ దూరంగా ఉంది. కోడలి కాని కొచ్చిన నాకైనా వీసమెత్తు బంగారం అట్టే పెట్టాడా ముసలాయన? కట్నంతోబాటు అత్తగారి సామాన్లు. బంగారం, అంతా సావిత్రికే దోచి పెట్టారు. బావగారూ! ఇన్నాళ్ళూ ఈ ముసలాయనతో మేమెంత బాధ పడ్డామో – ఆ భగవంతుడికి తెలుసు. ఇక మీదట మీరు చూస్తే చూడండి కాని ఆపరేషన్లూ, అవస్థలూ మేము పడలేం”

“పోనీ మీ కూడా హైదరాబాదు తీసుకెళ్ళ కూడదూ?” అర్నాద్ భార్యని తృప్తి పరచడానికి అడిగాడు.

"మా బ్రతుకులు మేడి పళ్ళు.. రెండువేల దాకా జీతం వస్తుందన్న మాటే గానీ నెలాఖరయ్యే సరికి దిక్కులు చూడాల్సిందే. సిటీలో అడుగడుగునా ఖర్చే అందుకని వైద్యం ఇక్కడే చేయిద్దాం. ఏ 'లోన్' తీసుకొని డబ్బు మాత్రం సాయం చేస్తాను"

"బాగా సెలవిచ్చారు బావగారూ.. ఏమిటీ అమ్మాయి ఇంత తెగించి మాట్లాడుతోంది అనకోకండి. చేసి చేసి ఉన్నాను గనక ప్రాణం విసిగిపోయింది. ఎద్దు వుండు కాకికి నెప్పా? మీరు చేతులు కడుక్కొని హైదరాబాదు వెళ్ళిపోతారు. కన్నవాళ్లంటే తీపి ఉండడం సహజమే కాని బాధ్యతలు మించి పరిగెత్తలేం కదా? మా అమ్మ ఆర్నెల్లుగా మంచాన పడుంది. తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకుంటే ఊరుకుం టారా మీ తమ్ముడు? నిజానికి మా అమ్మ ఆయన కెలా పరాయిదో, నాకు మావగారు కూడా అంతే. ఇన్నాళ్ళూ ఓపిక పట్టాను!"

" పార్వతీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడకు అన్నయ్యా సాధక బాధకాలు అతను చెప్పాడు. అంతమాత్రాన.." కళ్ళెర్ర జేసాడు అర్నాద్.

"అవునండీ ఈ లోకంలో ఎవరికెవరు? ఎవరైనా అవసరం ఉన్నంతవరకే. మీ నాన్నగారు మాత్రం ఏంచేసారు? మన పెళ్లయిన కొత్తలో ఏక్సిడెంట్‌లో కాలు విరిగి పోయిన ఎద్దు మీద ఏం దయ చూపించారో మీకు గుర్తు లేదా? ఆయన కసలు మమత, అనుబంధం అనే పదాలకు అర్థాలు తెలుసా. తెలిస్తే ఎవరైనా సమానమే. అవసరం తీరిన కుం టెద్దుకీ, మీ నాన్నగారికీ తేడా ఏమిటి? -- ఆయన కోసం మనమెందుకు....."

"పార్వతీ" ఆమె మాటలు పూర్తి కాకుండానే అర్నాద్ చేయి ఆవేశంతో పైకి లేచింది.

"తమ్ముడూ.." అర్నాద్ చేయిని బలంగా పట్టుకొని మురళి వారించాడు. తప్పన్నట్లు కళ్ళ తోనే అర్నాద్‌ని మందలించాడు. పార్వతి అక్కణ్నుంచి విసురుగా వెళ్లిపోయిన తర్వాత "పార్వతి చెప్పిన ఎద్దు విషయం...." అర్నాద్‌ని అడుగుతున్నాడు మురళి.

ముగ్గురి సంభాషణ, కీచులాట .... చాటు నుంచి వింటున్న పెరుమాళ్ళు మొహం వివర్ణమయి పోయింది. కుంటుకుంటూ వెళ్లి వాకిలిలోని మంచం మీద వాలిపోయాడు. . . . అతని కళ్ళ ముందు ప్రస్తావించిన ఎద్దుకు సంబంధించిన గతం....... లీలగా...

****

అప్పటికి పెరుమాళ్లు పదెకరాల నేలను సేద్యం చేస్తున్న రైతు .. నాలుగెకరాల సొంత పొలంతో పాటు - అర్నాద్ కూడా చదువుకు స్వస్తి చెప్పి వ్యవసాయంలో ప్రవేశించడం వల్ల మరో ఆరెక రాలు కౌలుకి తీసుకున్నారు. అప్పట్లో ట్రాక్టర్లింకా వాడుకలోకి రాకపోవడం వల్ల, ఖర్చుకి భయపడే పెరుమాళ్లు యంత్రాల జోలికి పోకపోవడం వల్లా పదెకరాలూ, పూర్తిగా, పశువుల మీదే ఆధారపడి సాగు చేసేవారు.

అర్నాద్ చేతిలో పశువులు బావుండేవి. తను కష్టించి సంపాదించిన సొమ్ముతో తండ్రికి తెలియకుండా దాణా సరుకులు కొని ఎడ్లను మేపేవాడు. ఇంట పుట్టిన రెండు 'అల్లుడు మావా' గిత్తలు పెరిగి పెద్దలై అతని సంరక్షణలో మంచి ఎడ్ల జతగా తయారయ్యాయి.

ఆ సంవత్సరం పసలపూడిలో సంక్రాంతికి నిర్వహించిన ఎడ్ల పోటీలో అర్నాద్ కూడా తన అల్లుడు మావల ఎడ్ల జతతో పాల్గొన్నాడు.

"రాజులు" కట్టేసి తొట్లో రెండు ఇసక బస్తాలు వేసి ఎడ్ల చేత బళ్ళు లాగించే ఆ పందెంలో అర్నాద్ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి లభించింది. ఊరంతా ఎడ్ల జతను ప్రశంసిస్తుంటే కొడుకు ప్రయోజకత్వానికి మురిసిపోయాడు పెరుమాళ్ళు. అందువల్లే పోటీలు జరిగిన మర్నాడు ఆ ఎడ్లబండి మీద కేశవరం తీర్థానికి స్నేహితులతో కలిసి వెళ్తానంటే కాదనలేక పోయాడు పెరుమాళ్లు. సందేహిస్తూనే అనుమతించాడు.

పెరుమాళ్లు భయపడినట్టే జరిగింది. అర్నాద్ వెళ్లిన గంట సేపటికే మండపేట వంతెన దగ్గర బండిని లారీ ఢీకొని యాక్సిడెంట యిందనే వార్త పెరుమాళ్లు చెవిన పడింది. అదురుతున్న గుండెల్తో అక్కడికి చేరుకున్నాడు.

సేద్యంలో సమర్థత వున్నా, ఎద్దు తార్రోడ్డు మీద అలవాటు లేక కార్లకు బెదిరాయట. ఎదురుగా వస్తున్న లారీ - లైసెన్సు లేని డ్రైవరు కంగారు పడ్డం వల్ల బండిని గుద్దేశాడు. మనుషులంతా చిన్న చిన్న గాయాలతో తప్పించుకున్నారు. "అల్లుడు" పేరుతో పిలువబడే ఎద్దు అక్కడికక్కడే చనిపోయింది. 'మావ' ఎద్దుకు మక్కి జారిపోయింది. లారీ డ్రైవరు పట్టుబడడంతో పెరుమాళ్ల కేసు పెడతానని బెదిరించి ఎడ్ల ఖరీదుకి సరిపోయే నష్ట పరిహారాన్ని వసూలు చేశాడు.

తర్వాత మిగిలిన ఒంటెద్దును అతి కష్టం మీద పొలంలోని చావట్లోకి చేర్పించాడు అర్నాద్. మొదట్లో ఎద్దు కాలు బాగవడం కోసం ప్రయత్నించి, కాలు రావడం సాధ్యం కాదని తేలిన తర్వాత దాని వైద్యం కోసం ఆ పైన ఏం ఖర్చు పెట్టినా దండగనే నిర్ణయానికి వచ్చాడు పెరుమాళ్లు. అర్నాద్ ఎంత చెప్పినా వినకుండా, నాటు వైద్యం తప్ప ఎల్లోపతి వైద్యానికి అంగీకరించ లేదు పెరుమాళ్లు. ఫలితంగా కదలలేని ఎద్దు చిక్కి శల్యమై కాకులు పొడవడం వల్ల ఒళ్లంతా పుళ్ళు పడింది. దాని బాధ చూడలేని అర్నాద్ ఎంత మొత్తుకున్నా, లెక్క చేయని పెరుమాళ్ళు ఆ కుంటెద్దును కసాయి వాళ్ళకమ్మి సొమ్ము చేసికొని - ఎద్దు వల్ల వచ్చిన లాభానికి మురిసిపోయాడు.


ఆ రాత్రంతా అర్నాద్‌కి ఒకటే జ్వరం. ఎద్దుకి సంబంధించిన పలవరింతలు...

ఆ సంవత్సరం నుండే వ్యవసాయంలో నష్టం ప్రారంభమైంది. అది ఎద్దును నిర్లక్ష్యం చెయ్యడం వల్ల వచ్చిన అనర్థమేనని అర్నాద్ అనుమానం. క్రమ క్రమంగా రెండెకరాలు అమ్మెయ్యాల్సిన అవసరం వచ్చింది......

***

మురళి జరిగింది విని తండ్రి స్వభావానికి సిగ్గుపడ్డాడు. మరదలు పార్వతి దగ్గర తండ్రిని తన కూడా తీసుకెళ్ళడానికి అశక్తత వ్యక్తం చేసినందుకు పశ్చాత్తాప పడ్డాడు. అనురాగం, అనుబంధం, రక్త సంబంధం, మమకారం . . . ఇవన్నీ వ్యాపార దృక్పథానికి భిన్నమైనవనీ, లాభనష్టాల రాళ్ళతో వీటిని తూచడానికి ప్రయత్నించడం అవివేకమనీ ఆచరణాత్మకంగా తండ్రికి చెప్పాలనీ అనుకున్నాడు. ఎన్ని కష్టనష్టాలెదురైనా . . . భార్యకు నచ్చజెప్పి తండ్రిని తన కూడా తీసుకెళ్ళి 'యాంపుటేషన్' చేయించాలని నిశ్చయించుకున్నాడు.

'కాలు తీయించుకోడానికి తండ్రి అంగీకరించక పోతేనో..! ఆయనకు ఊతగా ఉండి కాలు లేని లోటు తీరుస్తామనీ, పెద్ద దిక్కు లేని లోటు తమకు రానివ్వద్దనీ బ్రతిమాలాలి.' దృఢమైన నిర్ణయంతో తండ్రి మంచం దగ్గరకు వచ్చిన మురళి చేతికి పెరుమాళ్లు శరీరం చల్లగా మంచులా తగిలింది. పక్కమీద మూత తీసేసిన నిద్రమాత్రల సీసా......! ●



## — ఏ పోయెమ్ —

సంపెంగ సౌరభం
కోయిల సన్నాయి
ద్వారం వాయులీనం
రవివర్మ తైలవర్ణ చిత్రం
సముద్ర కెరటాల లాస్యం
పసిపాప బోసినవ్వు
పర్వత గంభీరత
ప్రియురాలి ప్రణయం
కళ్లముందు సౌందర్యాన్ని
ఆవిష్కరించిన దృశ్యం
ప్రాణానికి హాయి నిచ్చే గానం
శరీరంలోకి కొత్త రక్తం
ప్రవహించిన అనుభూతి
మంచిమిత్రుడు పంచిఇచ్చిన స్నేహం
మలయమారుతం పలకరింపు
పరిమళించిన వెన్నెల్లో
విరబూసిన తలపులు
అంబరవీధిలో మబ్బుతునకల ఇంద్రజాలం
మదిలో తెరుచుకొన్న నూతన గవాక్షం
ఏ పోయెమ్

—కొడిమెల శ్రీరామమూర్తి